ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025



డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 15 మందికి రిమాండ్

- 16 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా

ఎలమంచిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ట్రాఫిక్, పట్టణ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 31 మంది పట్టుకున్నట్టు ఎస్ఐలు సావిత్రి, రామకృష్ణ తెలిపారు. గురువారం వీరిని ఎలమంచిలి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా.. 16 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని, మరో 15 మందికి నాలుగు రోజులపాటు రిమాండ్ విధించారని చెప్పారు.

చేతులు మారుతున్న తహశీల్దార్ భూములు!

గత నెల రెండో తేదీన 43 మ్యుటేషన్లు

- అన్నీ పులగానిపాలెం గ్రామానికి చెందినవే...
- ఎవరు చేశారు...?, ఎవరికి చేశారు...?
- వెబ్‌ల్యాండ్‌లో వివరాలు
- అటువంటిదేమీ లేదంటున్న పెందుర్తి ప్రస్తుత తహశీల్దార్ ఆనంద్‌కుమార్



సుధాకర్ నాయుడు ఆధార్ కార్డు.

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెందుర్తి మండలంలో రిటైర్డ్ తహశీల్దార్ ఖాతా నంబర్‌పై ఉన్న భూములు చేతులు మారుతున్నాయి. ఆయన మరణించిన తరువాత ఆ ఖాతాలో భూములకు మ్యుటేషన్లు (రెవెన్యూ రికార్డుల్లో ప్రాపర్టీ టైటిల్ మార్పు) జరుగుతున్నాయి. అవన్నీ ఎవరు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రస్తుత తహశీల్దార్ ఆనందకుమార్ మాత్రం ఎటువంటి మ్యుటేషన్లు జరగలేదని అంటున్నారు. కానీ వెబ్‌ల్యాండ్‌లో లాలం సుధాకర్‌నాయుడు ఆధార్ నంబర్‌తో లింక్ అయి ఉన్న 9102 ఖాతా నుంచి 2025 జనవరి రెండో తేదీన సుమారు 43 మ్యుటేషన్లు జరిగాయి. వీటిని అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

గత ఏడాది అక్టోబరులో రిటైర్డ్ తహశీల్దార్ లాలం సుధాకర్‌నాయుడు మృతిచెందారు. రెవెన్యూ రికార్డులో కుటుంబ సమాచారం తీస్తే ఆయన ఇంకా బతికే ఉన్నట్టు చూపిస్తోంది. రికార్డులు అప్‌డేట్ కాలేదని అధికారులు అంటున్నారు. ఏదైనా భూమి మ్యుటేషన్ జరగాలంటే (కొత్త వ్యక్తి పేరు మీదకు ఆస్తి మారాలంటే) అప్పటివరకూ ఎవరి పేరుతో ఆ భూమి ఉందో ఆయన ఆధార్, మొబైల్ నంబర్ అవసరం. మ్యుటేషన్ దరఖాస్తు ప్రాసెస్‌లో భాగంగా ఆ మొబైల్ నంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వెళుతుంది. దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సుధాకర్‌నాయుడు చనిపోయిన తరువాత ఆ మొబైల్ తాము వాడడం లేదని ఆయన సోదరుడు ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆ మొబైల్‌కు ఎటువంటి ఓటీపీలు రావడం లేదని కూడా చెప్పారు. అలాగైతే సుధాకర్‌నాయుడు ఆధార్ నంబర్‌తో లింక్ అయి ఉన్న పులగానిపాలెం (పెందుర్తి మండలం) భూములు ఈ ఏడాది రెండో తేదీన మ్యుటేషన్ ఎలా జరిగాయనేది తెలియాల్సి ఉంది. చనిపోయిన రిటైర్డ్ తహశీల్దార్ పేరుతో ఉన్నది నోషనల్ ఖాతాయే అనుకున్నా...అందులో కొన్ని భూములకు మ్యుటేషన్ చేయాల్సి వస్తే...ఏ విధంగా ముందుకు వెళ్లాలో ఉన్నతాధికారులను అడిగి చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ జిల్లా కేంద్రంలో ఉన్న అధికారుల దృష్టికి తేకుండానే మండల స్థాయిలో జరిపించేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మ్యుటేషన్ దరఖాస్తు పరిశీలించినప్పుడు సుధాకర్‌నాయుడి పేరుతో ... మిగతా 8వ పేజీలో

పక్కాగా వాహనాల ఫిట్‌నెస్

అందుబాటులోకి కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రం

- సబ్బవరం మండలం నారపాడు వద్ద ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు
- ఇప్పటికే ప్రయోగాత్మకంగా సేవలు ప్రారంభం
- వాహనంలో చిన్నపాటి లోపం ఉన్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు తిరస్కరణ
- ఆర్టీవో కార్యాలయంలో వాహనదారులకు తప్పిన నిరీక్షణ


నారపాడులో వద్ద ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సరకు, ఇతర రవాణా వాహనాల ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాల జారీ మరింత వేగవంతం కానున్నది. ఫిట్‌నెస్ కోసం ఆయా వాహనాలను రవాణా శాఖ కార్యాలయానికి తీసుకెళ్లి రోజుల గంటల తరబడి వేచి వుండాల్సిన అవసరం లేదు. 'ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్' (ఏవీఎఫ్‌టీఎస్) అందుబాటులోకి రానున్నది. సబ్బవరం మండలం నారపాడు వద్ద ఏర్పాటు చేశారు. వాహనాల ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసిన ప్రైవేటు ఏజెన్సీ ద్వారా జరగనుంది. జిల్లాలో ఈ బాధ్యతలను ఇప్పటికే ఒక ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఇక్కడ కొద్ది రోజుల నుంచి ప్రయోగాత్మకంగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.


ఫిట్‌నెస్ కోసం ఏవీఎఫ్‌టీఎస్ వద్ద వేచివున్న వాహనాలు

జిల్లాలో సరకు రవాణా చేసే లారీలు, టిప్పర్లు, ట్రాలీలు, వ్యాన్‌లు, విద్యా సంస్థల బస్సులు, ఇతర రవాణా వాహనాలు సుమారు 60 వేల వరకు వున్నాయి. ఆయా వాహనాలను ఏడాదికి ఒకసారి రవాణా శాఖ కార్యాలయానికి తీసుకువచ్చి రవాణా శాఖ అధికారులతో పరీక్షచేయించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. ఈ సర్టిఫికెట్ లేకుండా వాహనాలను రోడ్డు మీద తిప్పితే భారీ జరిమానాలు విధించడంతోపాటు వాహనాలను సీజ్ చేసే అధికారం రవాణా శాఖ అధికారులకు వుంటుంది. కాగా ఫిట్‌నెస్ పరీక్షల కోసం రోజూ 20 నుంచి 30 వాహనాలు రవాణా శాఖ కార్యాలయానికి వస్తుంటాయి. అయితే వివిధ కారణాల వల్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) అన్ని వాహనాలను పూర్తి స్థాయిలో పరీక్షించడంలేదు. కొన్నింటికి తూతూమంత్రంగా తనిఖీలు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. దీంతో ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్లపై తిరుగుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రవాణా శాఖ కార్యాలయాల్లో జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల డొల్లతనంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతుండడంతో ఆధునిక సాంకేతికతతో 'ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్'లను ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాకు సంబంధించి ఏవీఎఫ్‌టీఎస్‌ను అనకాపల్లి-సబ్బవరం మధ్య గాలిభీమవరం రెవెన్యూ పరిధిలోని నారపాడు వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మకంగా ఫిట్‌నెస్ పరీక్షలు ... మిగతా 8వ పేజీలో

నూకాంబిక అమ్మవారికి

టీటీడీ నిధులు

ఆలయానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు

- పదేళ్ల క్రితం రూ.5 కోట్ల టీటీడీ నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు
- అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన కొంతమంది హైకోర్టులో 'పిల్'
- టీటీడీ నిధులు ఇవ్వొచ్చంటూ తాజాగా తీర్పు


నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):

స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయానికి మహర్దశ పట్టనున్నది. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) నిధులకు సంబంధించి నూకాంబిక ఆలయానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఆలయం అభివృద్ధికి టీటీడీ నుంచి ఐదు కోట్ల రూపాయలు త్వరలో విడుదల కానున్నాయి. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన వెలువడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు 2015వ సంవత్సరంలో అనకాపల్లి నాటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం అభివృద్ధికి టీటీడీ నుంచి రూ.ఐదు కోట్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన చంద్రబాబునాయుడు.. టీటీడీ నిధుల నుంచి రూ. ఐదు కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన కొంతమంది (వైసీపీ నేతలుగా ప్రచారం) టీటీడీ నిధులను అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయానికి మంజూరు చేయకూడదంటూ హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై టీటీడీ, దేవదాయ శాఖ అధికారులు అప్పట్లో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేశారు. పలు వాయిదాల అనంతరం టీటీడీ నిధులను నూకాంబిక అమ్మవారి ఆలయం అభివృద్ధికి కేటాయించవచ్చంటూ బుధవారం హైకోర్టు తీర్పు వెలువరించిందని ఆలయ ఇన్‌చార్జి ఈవో సుజాత తెలిపారు. ఈ మేరకు హైకోర్టు నుంచి ప్రొసీడింగ్స్ రావాల్సి ఉందని అన్నారు. నాడు ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చొరవతో సీఎం చంద్రబాబు టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయగా, ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని హైకోర్టులో నూకాంబిక అమ్మవారి ఆలయానికి అనుకూలంగా తీర్పు వచ్చేలా కృషి చేశారు.

వీడిన మిస్టరీ

పెందుర్తి జ్యోతిష్కుడు అప్పన్న హత్య కేసులో దంపతుల అరెస్టు

- భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే కక్షతోనే అంత మొందించాడు
- ఆనవాళ్లు దొరక్కుండా శవాన్ని కాల్చేందుకు యత్నం


అప్పన్న దొర(ఫైల్)

భీమునిపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తికి చెందిన జ్యోతిష్కుడు మోతి అప్పన్న దొర హత్య కేసును భీమిలి పోలీసులు ఛేదించారు. సంఘటన వెలుగులోకి వచ్చిన 24 గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి గురువారం రాత్రి భీమిలి సీఐ బొడ్డేపల్లి సుధాకర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

పెందుర్తి బీసీ కాలనీకి చెందిన అప్పన్నదొర ఊరూరా తిరుగుతూ పూజలు చేస్తుంటాడు. ఈనెల తొమ్మిదో తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన తిరిగి వెళ్లకపోవడంతో మరుసటిరోజు కుమారుడు దుర్గాప్రసాద్ ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో బుధవారం కాపులుప్పాడ సమీపంలోని ఒక లేఅవుట్‌లో శవాన్ని కాల్చిన ... మిగతా 8వ పేజీలో

బడి భోజనం మరింత రుచిగా!

వారంలో ఐదు రోజులు ఉడికించిన కోడిగుడ్లు/ ఎగ్ కర్రీ

- మూడేసి రోజులు రాగి జావ, వేరుశనగ చెక్కి
- కొత్త మెనూ అమలుకు మార్గదర్శకాలు జారీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం మరింత రుచిగా ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కొత్త మెనూ అమలు కోసం మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యా శాఖాధికారులు పాఠశాలలను సందర్శించి, ప్రస్తుతం అమలు చేస్తున్న మెనూపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కూడా మాట్లాడారు. అనంతరం కొత్త మెనూను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. దీనిని పరిశీలించిన పాఠశాల విద్యాశాఖ అధికారులు మార్పులు, చేర్పులతో నూతన మెనూకు ఆమోదముద్ర వేశారు.

పాఠశాలల్లో అమలు చేయనున్న కొత్త మెనూ
సోమవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడకబెట్టిన కోడిగుడ్డు, వేరుశనగ చెక్కి
మంగళవారం: అన్నం, కోడిగుడ్డు కూర, రసం, రాగి జావ
బుధవారం: వెజిటబుల్ పలావ్, బంగాళాదుంపల కుర్మా, ఉడకబెట్టిన కోడిగుడ్డు, వేరుశనగ చెక్కి
గురువారం: అన్నం, సాంబారు, కోడిగుడ్డు కూర, రాగిజావ
శుక్రవారం: పులిహోర, చెట్నీ, గోంగూర/కూరగాయ, ఉడకబెట్టిన కోడిగుడ్డు, వేరుశనగ చెక్కి
శనివారం: అన్నం, మిక్స్‌డ్ విజిటెబుల్ కర్రీ, రసం, రాగిజావ, స్వీట్ పొంగల్


రావికమతం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈఓ అప్పారావునాయుడు ఉపాధ్యాయులు (ఫైల్ ఫొటో)

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాకులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందలేదు. దీంతో మెనూ సక్రమంగా అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మానవ వనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్ విద్యా శాఖలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన మెనూలో సమూల మార్పులు చేయాలని నిర్ణయించారు. విద్యా శాఖ రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖాధికారులు పలు పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ అమలు, ఆహార పదార్థాల నాణ్యత, రుచి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం మెనూలో కొన్ని మార్పులు చేసి ప్రభుత్వానికి నివేదించారు. దీనిని పరిశీలించిన పాఠశాల విద్యా శాఖ అధికారులు కొత్త మెనూకు ఆమోదముద్ర వేశారు.

జిల్లాలో 1,407 ప్రభుత్వ పాఠశాలలు వున్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 1,033, యూపీ స్కూళ్లు 148, ఉన్నత పాఠశాలలు 226 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 93,556 మంది విద్యార్థులు చదువుతున్నారు. కూటమి ... మిగతా 8వ పేజీలో

స్టీల్‌ప్లాంటుకు భూములు సిద్ధం

బల్క్‌డ్రగ్ పార్క్‌కు మరో వెయ్యి ఎకరాలు సేకరణ

- త్వరలో నోటిఫికేషన్ జారీ
- కలెక్టర్ విజయకృష్ణన్
- కారిడార్ భూములు పరిశీలన


జాతీయ రహదారి నుంచి కారిడార్ భూములకు రోడ్డు నిర్మాణం కోసం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నక్కపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రైవేటు కంపెనీ ఏర్పాటు చేయనున్న స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన భూములు సిద్ధంగా వున్నాయని, బల్క్ డ్రగ్ పార్క్‌కు కేటాయించిన 1,800 ఎకరాలతోపాటు, మరో 1,000 ఎకరాలు సేకరించాల్సి వుందని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ చెప్పారు. ఆమె గురువారం మండలంలోని కారిడార్ గ్రామాల్లో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, మాట్లాడారు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం మరో వెయ్యి ఎకరాల భూ సేకరణకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేఇస్తామని చెప్పారు. రైతుల నుంచి వ్యతిరేకత లేకుండా భూ సేకరణ పనులు చేపట్టాలని నర్సీపట్నం ఆర్డీవో వీవీవీ రమణను ఆదేశించారు. అమలాపురం, రాజయ్యపేట, మూలపర్ర గ్రామాల్లో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లోని నక్కపల్లి క్లస్టర్ కోసం సేకరించిన భూములను కలెక్టర్ పరిశీలించారు. జాతీయ రహదారిపై కాగిత గ్రామం నుంచి అమలాపురం వరకు కారిడార్ భూముల కోసం నిర్మించనున్న రహదారికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. అమలాపురం వద్ద నిలిచిపోయిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. సర్వే చేయకుండా సబ్‌స్టేషన్‌ను ఎలా నిర్మిస్తున్నారంటూ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కారిడార్ నిర్వాసితులకు పెదబొడిగల్లం సమీపాన ఇవ్వనున్న భూములను ఆమె పరిశీలించారు. ఇక్కడ తాగునీటి సమస్య వున్నట్టు గుర్తించిన కలెక్టర్.. నీటి సదుపాయం లేనిచోట పునరావాసం ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. కాగా డి.పట్టా భూముల్లో వున్న చెట్లకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని, నక్కపల్లిలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పునరుద్ధరించాలని వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం నేత ఎం.అప్పలరాజు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్ ట్రాన్సిట్ హాల్ట్


మాజీ సీఎం జగన్‌ను కలిసిన గుడివాడ అమర్, బొడ్డేడ ప్రసాద్, కరణం ధర్మశ్రీ, విజయ్‌ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లా పాలకొండ వెళుతూ కొద్దిసేపు విశాఖపట్నం విమానాశ్రయంలో ఆగారు. ఆయన తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు విశాఖపట్నం చేరుకున్నారు. విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో జగన్మోహనరెడ్డిని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేశ్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, తదితరులు కలిశారు. అనంతరం మధ్యాహ్నం 1.20 గంటలకు ఆయన హెలికాప్టర్‌లో పాలకొండ వెళ్లారు. పాలకొండ నుంచి తిరిగి సాయంత్రం ఐదు గంటలకు విశాఖ చేరుకున్న జగన్మోహనరెడ్డి...ఆరు గంటలకు విమానంలో బెంగళూరు బయలుదేరి వెళ్లారు.

బీఎన్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

చోడవరం-గోవాడ మధ్య రోడ్డుపై ఆగిపోయిన ఆటో

- ఇదే సమయంలో కార్లను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- డ్రైవర్‌తో కార్ల యజమానులు వాగ్వాదం
- గంటన్నరపాటు నిలిచిపోయిన వాహనాలు


చోడవరం- గోవాడ మధ్య నిలిచిపోయిన వాహనాలు

చోడవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమిలి- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో చోడవరం-గోవాడ మధ్య గురువారం సుమారు గంటన్నరపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఉదయం పది గంటల సమయంలో కొత్తూరు జంక్షన్, గోవాడ మధ్యలో ఒక ఆటో సాంకేతిక సమస్యతో రోడ్డుపై ఆగిపోయింది. సింగిల్ లేన్ రోడ్డు కావడంతో ఆటోకు వెనుక నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో పాడేరు నుంచి విశాఖ వెళుతున్న ఆర్టీసీ బస్సు, ముందు ఆగి ఉన్న కారును ఢీకొన్నది. ఆ కారు దానికి ముందున్న మరో కారును ఢీకొన్నది. దీంతో కార్ల యజమానులు రోడ్డు మధ్యలో వాహనాలను నిలిపివేసి బస్సు డ్రైవర్‌తో వాదనకు దిగారు. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంట తరువాత ఈ మార్గంలో ప్రయాణిస్తున్న కొంతమంది జోక్యం చేసుకుని, కార్ల యజమానులకు నచ్చచెప్పి వాహనాలను రోడ్డు మధ్య నుంచి పక్కకు తీయించారు. దీంతో వాహనాల రాకపోకలు ... మిగతా 8వ పేజీలో

రఘువర్మకు మద్దతుగా ప్రచారం



ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటును రఘువర్మకు వేసి గెలిపించాలని గురువారం ఏపీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు పలు పాఠశాలల ఉపాధ్యాయులను కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, గౌరవాధ్యక్షుడు ఎన్.వి.సూర్యనారాయణ, స్థానిక ప్రతినిధులు ఏవీహెచ్ శాస్త్రి, కె. శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కె. వీరభద్రరావు, మండల అధ్యక్షుడు బొడ్డేడ సత్యనారాయణ, తదితరులు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి రఘవర్మకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.లక్ష్మణరావు, పి.అప్పారావు, సత్యారావు, జి.మేఘప్రసాద్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పాటల పోటీలకు ఏర్పాట్లు

ఎలమంచిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఎస్పీ.బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని ఎలమంచిలిలో జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహక కమిటీ చైర్మన్ మత్తుర్తి రామారావు తెలిపారు. బాలు జయంతిని జూన్ 4 వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏబీఎంఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా పెదపాటి



నియామక పత్రాలు అందజేస్తున్న ఏబీఎంఎస్ జేఏసీ రాష్ట్ర మహిళా చైర్మన్ మంచా నాగమల్లేశ్వరి

పాయకరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత మాల సంఘాల జేఏసీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా పాయకరావుపేటకు చెందిన దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, పాయకరావుపేట నియోజకవర్గ అధ్యక్షునిగా ఇంజరపు సూరిబాబు నియమితులయ్యారు. గురువారం పాయకరావుపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర మహిళా చైర్మన్ డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి వీరికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ఏబీఎంఎస్ జేఏసీ అధ్యక్షుడు ఉప్పులేటి దేవిప్రసాద్ ఆదేశాల మేరకు వీరిని నియమించినట్టు చెప్పారు. జిల్లాలో జేఏసీ బలోపేతం లక్ష్యంగా జిల్లా, నియోజవర్గ, మండల స్థాయి కమిటీలను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఐఎన్.మూర్తి, పల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు పరిశీలించిన అధికారులు



భూరికార్డును పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పితూరులో సెజ్ కోసం సేకరించిన భూముల్లో ఆలయ భూములను రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు గురువారం పరిశీలించారు. దుప్పితూరులో భద్రావతి సమేత భావనారుషి ఆలయానికి చెందిన భూములు 20 ఏళ్ల క్రితం సెజ్ భూసేకరణలో పోయాయి. కాని ఇంతవరకు పరిహారం మాత్రం ఇవ్వలేదు. దీంతో ఆలయ నిర్వాహకులు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏపీఐఐసీ ఆర్ఐ మురళీకృష్ణ, వీఆర్వో రవి పరిశీలన జరిపారు. ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని వారు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి,ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గృహోపకరణాల వినియోగంలో భద్రతా ప్రమాణాలు, రహదారి భద్రతపై హెటిరో పరిశ్రమ ఆద్వర్యంలో గురువారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీలను హెటిరో ప్రతినిధులు సుబ్బారెడ్డి, కుల్లాయిరెడ్డి, శ్రీనివాస్, ఎంఈవో కె.నరేశ్, తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు పర్యవేక్షించారు. మండల పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి హెటిరో యాజమాన్యం మార్చి3వ తేదీన బహుమతులు అందజేస్తుందని ఎంఈవో చెప్పారు.

ఉపమాక గ్రంథాలయ రికార్డుల తనిఖీ



గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న వెంకట్రావ్

నక్కపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావ్ తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పాఠకుల సంఖ్యను పెంచాలని ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి జనార్దన్‌కు సూచించారు. విద్యార్థులను గ్రంథాలయంలో భాగస్వామ్యం చేయాలని, పంచాయతీ నుంచి గ్రంథాలయ సెస్సును వసూలు చేసేవిధంగా పంచాయతీ అధికారులతో మాట్లాడాలని సూచించారు. గ్రంథాలయ రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉపమాక ఆలయ అభివృద్ధికి అడుగులు

- పలు నిర్మాణాలకు ప్రతిపాదనలు
- పరిశీలించిన టీటీడీ ఇంజనీరింగ్ ఎస్ఈ జగదీశ్వరరెడ్డి



ఉపమాక ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్ఈ జగదీశ్వరరెడ్డి

నక్కపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ఉపమాక క్షేత్రం అభివృద్ధి వైపు అడుగులేస్తోంది. ఇప్పటికే రూ30 లక్షలతో ఆలయంలో గ్రానైట్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇటీవల హోం మంత్రి అనిత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని కలిసి, పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. హోం మంత్రి సిఫార్సు మేరకు టీటీడీ చైర్మన్, ఈవోలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులను గురువారం ఉపమాక పంపారు. కొండపై మెట్ల మార్గాన్ని విస్తరించడం, స్వామివారి పుష్కరిణిని బాగు చేయడం, కల్యాణ మండపం, డార్మిటరీ, అతిథి గృహాల నిర్మాణాలు వంటి అంశాలపై టీటీడీ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ జగదీశ్వరరెడ్డి పరిశీలించారు. ఉపమాక ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జితో చర్చించారు. కల్యాణ మండపం, అతిథి గృహాల నిర్మాణాలకు స్థలం కేటాయింపు అంశంపై బుజ్జితో ఎస్ఈ మాట్లాడారు. ఈ అంశాలపై టీటీడీ ఈవో, చైర్మన్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ రవికుమార్, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, తోలేటి శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఫలసాయం గ్రామాభివృద్ధికి వినియోగించాలి

- గ్రామసభలో నిర్ణయించిన మత్స్యకార కుల పెద్దలు



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకార కుల పెద్దలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పూడిమడక సర్వే నంబరు 82 లో గల 80 ఎకరాల్లో సాగుచేయగా వచ్చిన ఫలసాయాన్ని గ్రామాభివృద్ధికే వినియోగించాలని గ్రామ మత్స్యకార కుల పెద్దలు నిర్ణయించారు. గురువారం పూడిమడకలో కుల పెద్దలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రభుత్వ భూమిలో పూడిమడక మత్స్యకారులు సాగు చేస్తూ వచ్చిన ఆదాయాన్ని గ్రామాభివృద్ధితోపాటు గ్రామ దేవతల పండగలకు ఇంతవరకు వినియోగిస్తున్నారు. అయితే దీనిపై కొందరు కన్నేసి దున్నడానికి ప్రయత్నించగా గ్రామ కుల పెద్దలు అడ్డుకున్నారు. అంతేకాక తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ భూమిలోకి ఎవరూ రాకుండా గ్రామస్థులంతా అడ్డుకోవాలని, గతంలో వలే గ్రామస్థులంతా సాగుచేసి వచ్చిన ఆదాయాన్ని గ్రామానికి వినియోగించాలని కుల పెద్దలు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు చేపల వెంకట రమణ, చోడిపల్లి అప్పారావు, మేరుగు వెంకటరావు, చేపల తాతలు, మేరుగు కాసుబాబు, వాడమదుల పెద సోములు, బొడ్డు జగ్గ, మేరుగు చినరాజులు, దూడ మసేను, మైలపల్లి మసేను తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

- డీఎస్పీ విష్ణు స్వరూప్
- ఎలమంచిలిలో అవగాహన బైక్ ర్యాలీ



ర్యాలీలో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్

ఎలమంచిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్టయితే సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవచ్చునని డీఎస్పీ విష్ణు స్వరూప్ అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న సమయంలో క్షణంపాటు కూడా నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానం చేరుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడపవద్దని, దీనివల్ల కుటుంబం వీధిన పడుతుందన్నారు. సర్కిల్ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్, పలు రహదారులపై ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు సావిత్రి, రామకృష్ణ, ఉపేంద్ర, ప్రసాద్, మైహోమ్ సిమెంటు పరిశ్రమ ప్రతినిధులు వెంకటరావు, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో 'పేట' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న సీహెచ్.విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సుచిర్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 32వ సీవీ.రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడంతోపాటు యంగ్ జీనియస్ అవార్డులు అందుకున్నారు. గురువారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ విలేకర్లతో మాట్లాడుతూ.. గతేడాది డిసెంబరులో సుచిర్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సీవీ.రామన్ టాలెంట్ టెస్టులో తమ విద్యార్థులు ఎం.హంసిని, ఎం.విశ్రుత్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి యంగ్ జీనియస్ అవార్డులు అందుకున్నారన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో ఆర్.సాత్విక్‌చంద్ర, కె.ప్రహసిత, డి.విఖ్యాత్, ఇ.నవీన్‌హర్ష, కె.సిద్ధార్థవర్మ, పి.శ్రీగౌతమ్‌కృష్ణ ప్రథమ స్థానం, వై.రిషిదుర్గ్, వి.శ్రీవత్స, ఎ.భువనశ్రీనివాస్ కామేష్ ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. వీరంగా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

నిబంధనలతోపాటు జాగ్రత్తలు పాటించాలి

- ఆటో యూనియన్ సభ్యులతో ఎస్ఐ ప్రసాదరావు



ఆటో యూనియన్ సభ్యులతో సమావేశమైన ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు నిబంధనలతోపాటు జాగ్రత్తలు పాటించి డ్రైవింగ్ చేయాలని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆటో యూనియన్ సభ్యులతో గురువారం ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్కూల్ పిల్లలను డ్రైవింగ్ సీటులోను, వెనుక కూర్చోబెడుతున్నారని, ఆ విధానాన్ని వీడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించడం నేరమన్నారు. చట్టం, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరిపై హత్యాయత్నం కేసు

మునగపాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విచక్షణారహితంగా కొట్టి చంపడానికి పూనుకున్నారంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో గణపర్తి గ్రామానికి చెందిన పొలిమేర దీపిక కొన్ని నెలలుగా మునగపాక ఎన్‌టీఆర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి ఇంటి పక్కన ఉన్న అన్నంపల్లి సరిత, శాంతిరాజులు దీపిక ఇంటికి వెళ్లి భుజం, తల మీద, కన్నుపైన తీవ్రంగా కొట్టారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న దీపికను కుటుంబీకులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సరిత, శాంతిరాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధి కోసమే జ్ఞానజ్యోతి



కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో డిజిటల్ బోర్డులో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కోటవురట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞాన జ్యోతి శిక్షణ ఇస్తున్నట్టు రిసోర్స్‌పర్సన్ విలియమ్స్, అప్పారావు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో మూడో రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెలకువలను ఈ శిక్షణ ద్వారా అందిస్తామన్నారు. అభ్యాసనా నైపుణ్యాలు పెంపొందిస్తామన్నారు. పిల్లలకు నృత్యాలు, పద్యాలు నేర్పించే విధానాన్ని వివరించారు. కార్యకర్తలకు పద్యాలు పాడుతూ డ్యాన్స్‌లు చేస్తూ వివరించారు.

నేడు రామలింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రారంభం



ఎలమంచిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొత్తపేటలో రామలింగేశ్వరస్వామి ఆలమ పునఃప్రారంభానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 11.52 గంటలకు ఆలయ ప్రారంభంతోపాటు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సచ్చిదానంద సరస్వతి, కృష్ణ శర్మ, భాగవతుల గణేశ శ్రీనివాస శర్మల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ఆలయ ఆవరణలో 4వ రోజు గురువారం వేద పండితుల సమక్షంలో ప్రతిష్ఠా విగ్రహాలకు ధాన్యాదివాసం, పుష్పాదివాసం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు



ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్లా కృష్ణయ్య మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడుకి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడుకు ఓటు వేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సీనియర్ నాయకుడు ఆదినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగు, మండల అధ్యక్షుడు భద్రరావు, సమన్వయకర్త సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలేకర్లకు రక్షణ కల్పించండి

మునగపాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం రక్షణ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మళ్ల రాము కోరారు. మన్యం జిల్లా మక్కువ మండలం విలేకరిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు, ఎస్.ఐ పి.ప్రసాదరావులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆడారి ఆత్మారాం, వెలగా జగదీశ్, సబ్బి కృష్ణ, కర్రి భాస్కరరావు, శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంగవరంలో 23వ సప్తాహం ప్రారంభం



మంగవరంలో నిర్వహిస్తున్న సప్తాహంలో భజన చేస్తున్న భక్తులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం 23వ సప్తాహ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారం రోజులపాటు రాత్రులు, పగలు నిరంతరాయంగా భజనలు చేస్తూ భక్తి గీతాలు ఆలపిస్తారు. గ్రామస్థుల సహాయ, సహకారాలతో 23 సంవత్సరాలుగా సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రతీ ఏడాది సప్తాహ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ముగింపు రోజున అన్న సమారాధన నిర్వహిస్తామని వారు తెలిపారు.

నేడు 12 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో 12 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. అచ్యుతాపురం సెక్షన్ పరిధిలో కొత్త విద్యుత్ స్తంభాల వేస్తున్నందున వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట బర్మాకాలనీ, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, ఆర్ఆర్ కాలనీ, దిబ్బపాలెం, వెంకటాపురం సెంటర్, మార్టూరు రోడ్, అచ్యుతాపురం జంక్షన్, సాయిప్రియ లేఅవుట్‌లకు శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రేపు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యోకోహామా కర్మాగారంలో ఉద్యోగాల కోసం శనివారం తమ కళాశాలల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తెలిపారు. ఐటీఐ, డిప్లొమాతోపాటు ఏదైనా డిగ్రీ చదివిన మహిళలు మాత్రమే ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన తెలిపారు. కనీస ఎత్తు 5.3 అడుగులు, కనీస వయసు 18 నుంచి 25, బరువు 50 కేజీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాలకు 97012 41753 నంబరుకి సంప్రదించాలన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము



సమావేశంలో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడచిన 25 ఏళ్లకు పైబడి పనిచేస్తున్నా వేతనాలు పెరగలేదన్నారు. చాలీ చాలని జీతాలతో వీరంతా దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. వీరికి గౌజులు, బూట్లు, మాస్కులు, నూనె, సబ్బులు, పనిముట్లు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో కె. సోమునాయుడు, కె. రామనదాశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ రోడ్డుకు మోక్షం చూపండి



కాలనీవాసుల రాకపోకలకు అడ్డుగా డ్రైనేజీ గోడ

మునగపాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ ప్రత్యామ్నాయ రహదారికి మోక్షం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు. మునగపాక మెయిన్‌రోడ్డు శ్రీవిశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని ఆనుకొని ఇందిరమ్మ కాలనీకి ఉన్న రోడ్డు సమీపంలో నిర్మించిన డ్రైనేజీతో విఘాతంగా మారింది. ప్రధాన రోడ్డు మార్గం కంటే ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం పాదాచారులు మొదలు కొన్ని అందరికి అనువుగా ఉండేది. అయితే ఇటీవల నిర్మించిన డ్రైనేజీ కారణంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకుండా పోయింది. పంచాయతీ వారు కాస్త శ్రద్ధ తీసుకొని అవసరమైన పనులు చేస్తే తిరిగి యథావిధిగా వినియోగంలోకి వస్తుందని, అది కూడా తక్కువ ఖర్చుతో నెరవేరుతుందని కాలనీవాసులు చెబుతున్నారు.

కాలి నడకన శ్రీశైలం చేరుకున్న శివ భక్తులు



శ్రీశైలం చేరుకున్న శివభక్తులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం నుంచి కాలినడకన వెళ్లిన శివ భక్తులు గురువారం సాయంత్రం శ్రీశైలం చేరుకున్నారు. సత్యవరం గ్రామానికి చెందిన గోళ్ల శివ, నారపురెడ్డి జోగిరాజు, బోయిడి తాతయ్యలు, తదితర శివ భక్తులు ఈ నెల 3వ తేదీన సత్యవరం నుంచి కాలినడకన శ్రీశైలం బయలుదేరారు. సుమారు 530 కిలోమీటర్లు 17 రోజులు పాటు నడిచి గురువారం శ్రీశైలం కొండకు చేరుకున్నట్టు శివభక్తులు తెలిపారు. స్వామి వారికి ఇరుముడ్లు సమర్పించి మల్లికార్జునస్వామి వారిని దర్శించుకోనున్నట్టు వారు తెలిపారు.

టీటీడీ నిధులతో
నూకాంబిక ఆలయం సమగ్రాభివృద్ధి

▸ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ


మాట్లాడుతున్న పీలా గోవింద

తుమ్మపాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నూకాంబిక ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా రూ.ఐదు కోట్లు మంజూరు చేయడం ఆనంద దాయకమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి నిధులు విడుదల అంశంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృషి ఎనలేనిదని కొనియాడారు. గతంలో ఆలయానికి టీడీపీ ప్రభుత్వం రూ.ఐదు కోట్లు మంజూరు చేసినప్పటికీ కొన్ని దుష్టశక్తులు అడ్డుకునే ప్రయత్నం చేసి కోర్టులకు వెళ్లడం జరిగిందన్నారు. సుదీర్ఘ వాదనలు విన్న కోర్టు పదేళ్ల తరువాత అమ్మవారి దేవస్థానానికి అనుగుణంగా తీర్పునిచ్చిందని వివరించారు. అలాగే గతంలో టీడీపీ హయాంలో ఆలయ అభివృద్ధికి స్థలాన్ని కూడా కొనుగోలు చేశామని, రోడ్డు విస్తరణ కోసం వుడా నుంచి రూ.ఎనిమిది కోట్లు మంజూరుకు చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. అమ్మవారి ఆలయానికి కేటాయించిన నిధులతో ఆలయ సమగ్ర అభివృద్ధి చెందుతుందని హర్షం వ్యక్తం చేశారు.

రైతు రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయండి : ఏడీఏ


రైతు రిజిస్ట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ రామారావు

సబ్బవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతు రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ. రామారావు సూచించారు. మండలంలోని సబ్బవరం, తవ్వవానిపాలెం, అంతకాపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఈ ప్రక్రియను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులతో మాట్లాడుతూ ఈనెల 25లోగా రైతు సేవా కేంద్రాలకు రైతులంతా వెళ్లి వన్-బి, ఆధార్, ఫోన్ నెంబర్లు గ్రామ వ్యవసాయ సహాయకులకు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు పదకొండు విశిష్ట సంఖ్య గల కార్డు పొందవచ్చన్నారు. ఈ కార్డు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి అందిస్తున్న పథకాలను పొందవచ్చునన్నారు. మండలంలోని 8,300 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకూ 4,400 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఏవో పోతల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు, ఏఈవో బాలరాజు, వీఏఏలు భావన, శ్రావణి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూఏ కార్మికులు నిరసన


డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ కార్మికులు గురువారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనకాపల్లి డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్ నారాయణను అక్రమంగా 1/19 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెన్షన్ చేసిన కారణంగా ఈ ఆందోళన చేపట్టారు. తక్షణమే ఆ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. యూనియన్ డిపో అధ్యక్షుడు ఏఎన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కేఎన్‌వీ రమేష్, ఎం.బంగార్రాజు, ఎంఎస్ అప్పుడు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపడం తగదు'



డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

పరవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సినిమాహాల్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపడం తగదంటూ సదరు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజల ఆశలను అడియాసలు చేసిందన్నారు. ఉపాధి హామీ పథకానికి కూడా కేటాయింపులు సక్రమంగా లేవని వాపోయారు. కార్పొరేట్ సంస్థలకే కేంద్ర బడ్జెట్ అనుకూలంగా ఉందని ఎద్దేవా చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి మాట్లాడకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.లచ్చిబాబు, కె.అప్పారావు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి కృషి : కొణతాల

కొత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం అనకాపల్లిలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠి ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో యాభై శాతం ఫీజు రాయితీ, హెల్త్‌కార్డులు మంజూరుతో పాటు ప్రభుత్వ పథకాలు జర్నలిస్టులకు వచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు విడతల వారీగా ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.


మరిడిమాంబను దర్శించుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి


దిబ్బపాలెం అమ్మవారి ఆలయంలో...


సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో వేషధారణలు

దండాలు.. దండాలు. అమ్మోరు తల్లీ...

▸ అనకాపల్లి, పరవాడ, సబ్బవరం మండలాల్లోని పలు గ్రామాల్లో వైభవంగా గ్రామ దేవతల సంబరాలు
▸ ఎటుచూసినా భక్తజన సందోహం ▸ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కొణతాల, పంచకర్ల, జీవీఎంసీ మేయర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేటలో మరిడిమాంబ జాతరను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత దంపతులతో పాటు పలువురు రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ వీరిని ఘనంగా సత్కరించింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం పుర వీధులు సందడిగా మారాయి. రాత్రికి ఆలయం వద్ద, మెయిన్ రోడ్డులోని పలుచోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తుమ్మపాల : దిబ్బపాలెంలో మరిడిమాంబ అమ్మవారి పండుగ గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్లు, గుర్రపు పరుగు పందేలను నిర్వహించారు. పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.


మరిడిమాంబను దర్శించుకుంటున్న కొణతాల


దేవాడలో కొత్తమ్మతల్లి సన్నిధిలో పంచకర్ల

పరవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ ప్రజల ఆరాధ్య దేవత కొత్తమ్మతల్లి పండుగ గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో పాటు స్థానిక నాయకులు కాకి బాబు, పంచకర్ల ప్రసాద్, వియ్యపు చిన్న, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరి సన్యాసినాయుడు, నక్క శ్రీను, కొండబాబు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం జరిపారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అలాగే, కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ పండుగ గురువారం అత్యంత ఘనంగా జరిగింది. సర్పంచ్ బొండా కనకారావు, నాయకులు బొండా పెద్దినాయుడు, ప్రకాష్ నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించిన అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు.

ఘనంగా కనకదుర్గమ్మవారి అనుపోత్సవం



సబ్బవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పైడివాడ అగ్రహారం లో కొలువుదీరిన కనకదుర్గమ్మ వారి అనుపోత్సవాన్ని గురువారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలతో పాటు కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. సాయంత్రం కాళీమాత వేషధారణలు, తీన్మార్ డప్పులు, తప్పెటగుళ్లు తదితరాలతో అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రికి ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి అమ్మవారిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు అక్కిరెడ్డి దుర్గినాయుడు, గొంతిన పైడిరాజు, కోన సత్యనారాయణ, బొబ్బరి కన్నారావు, కూటమి నాయకులు బుచ్చిరాజు, ఇందలి రమణ, శీరం అప్పలరాజు, కర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

▸ అవగాహన సదస్సుల్లో పోలీసు అధికారులు



అనకాపల్లి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ చైతన్య


కశింకోటలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామినాయుడు


పరవాడలో దాబా యజమానులతో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ట్రైనీ డీఎస్పీ చైతన్య స్పష్టం చేశారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో గురువారం ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు మోటార్ వాహన చట్టంపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు అంతగా ఆస్కారం ఉండదన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి నడపరాదని, ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేటప్పుడు వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రమాదాల నివారణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, పట్టణ ఎస్ఐ డి. ఈశ్వరరావు, సిబ్బంది, ఆటో, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

కశింకోట : ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో ప్రయాణికులను ముందు కూర్చోబెట్టడం నిషేధమని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, పరిమితికి మించి వేగంగా వాహనం నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం, బయ్యవరం, కశింకోట నుంచి ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పరవాడ : మద్యం సేవించి ఆటోలు నడపవద్దని పరవాడ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలు జి.మహాలక్ష్మి, బి.కృష్ణారావు సూచించారు. పరవాడ, వెన్నెలపాలెం, వాడచీపురుపల్లి, లంకెలపాలెం ఆటో స్టాండ్‌లలో గల ఆటో డ్రైవర్లలతో గురువారం వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవద్దన్నారు. అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని కోరారు. గంజాయి రవాణా జరుగుతున్నట్టు దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సుమారు రెండు వందల మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. అలాగే, దాబాల్లో మద్యం విక్రయాలను జరపొద్దని సీఐ సూచించారు. లంకెలపాలెం, పరవాడ పరిసర ప్రాంతాల్లో గల దాబాల యజమానులతో గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. దాబాల్లో మద్యం విక్రయాలు జరపడానికి అనుమతులు లేవన్నారు. నిబంధనలు పాటించని దాబా యజమానుల పై కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి పది గంటలకల్లా దాబాలను మూసివేయాలన్నారు.

ఇదిలావుంటే, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు సూచించారు. ముత్యాలమ్మ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు కాల్ చేస్తే లిఫ్ట్ చేయవద్దన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో
లో వోల్టేజీ సమస్య పరిష్కారం

సబ్బవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సబ్బవరంలోని కోమటి వీధి, బ్రాహ్మణ వీధి, గెడ్డం వీధివాసులు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న లో వోల్టేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక నాయకులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఏపీఈపీడీసీఎల్ అధికా రులు గురువారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో మూడు వీధులకు చెందిన వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ అశోక్, స్థానిక నాయకులు బర్ల రమణ, గెడ్డం రమేష్, జెట్టి ప్రసాద్, దంగేటి నాగేశ్వరరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత చిన్నస్వామికి సత్కారం


చిన్నస్వామిని సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పేరూరి చిన్నస్వామిని ఆలయ పాలకవర్గం గురువారం సత్కరించింది. విశ్వగురు ప్రపంచ రికార్డు సంస్థ, స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డును చిన్నస్వామికి ప్రదానం చేసిన సందర్భంగా ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పాలకవర్గసభ్యులు, అర్చకులు సత్కరించారు. పాలక మండలి సభ్యులు మద్దాల నారాయణరావు, పెంటకోట గణేష్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

మూలపేటలో తాగునీటి సమస్యపై వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

తుమ్మపాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మూలపేటలో జల్‌జీవన్ మిషన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామ నాయకుడు కోన లక్ష్మణతో పాటు పలువురు గ్రామస్థులు ఆరోపించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ చేస్తూ గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్‌మిషన్ పనులను అరకొరగా చేపట్టి విడిచిపెట్టడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు అప్పలకొండ, పల్లా శ్రావణి, గౌరి, లక్ష్మి, నరసింగరావు, శ్రీను పాల్గొన్నారు.

ఆట పాటల ద్వారా ఆంగ్ల భాషపై అవగాహన


ఆంగ్లభాషపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కశింకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తి ఉన్న పాఠశాలలో విద్యార్థులకు ఆట, పాటల ద్వారా ఆంగ్లభాషపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల భాష ఉపాధ్యాయులు కె.సబితలక్ష్మి, బోయిన చిన్నారావులు ఆంగ్లానికి సంబంధించి కొన్ని అంశాలను ఆటలు, పద్యాలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి మాట్లాడుతూ ఇలాంటి పండుగలు పాఠశాలలో నిర్వహించడం వల్ల పిల్లలు భాషపై పట్టు సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

అక్రమంగా మద్యం
విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు పంచాయతీ శివారు మర్రిపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ లక్ష్మీనాయుడుకు అందిన సమాచారం మేరకు సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. పారుపల్లి దారకొండ అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతుండడంతో ఆయన్ను అదుపులోకి తీసుకోవడంతో పాటు సుమారు 14 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

తాళ్లపాలెం గురుకులంలో
ప్రవేశాలకు దరఖాస్తులు

కశింకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మార్చి 3వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో లేదా హెల్ప్ లైన్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

తుమ్మపాల సంపద కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం

▸ మరమ్మతులు పూర్తి ▸ నేడు పునః ప్రారంభం


వర్మీ కంపోస్టు తయారీ తొట్టెలను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

తుమ్మపాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో సుమారు పదేళ్ల క్రితం నిర్మించిన సంపద కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి, సంపద కేంద్రాల జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి తదితరులు శుక్రవారం ఈ కేంద్రాన్ని పునః ప్రారంభించనున్నారు. సంపద కేంద్రాల నిర్వహణపై ఆయా పంచాయతీల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని సైతం నిర్వహించనున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ సంపద కేంద్రం మరుగున పడింది. ఇటీవల ఈ అంశంపై 'లక్ష్యానికి తూట్లు... చెత్తతో పాట్లు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇక్కడి డంపింగ్ యార్డును తరలించడంతో పాటు సంపద కేంద్రానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో తుమ్మపాలలో చెత్త సమస్య పరిష్కారంతో పాటు పంచాయతీకి ఆదాయం సమకూరనుందని అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లంకెలపాలెం కూడలిలో పారిశుధ్య పనులు


చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

లంకెలపాలెం, ఫిబ్రవరి 20 : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలిలో గల దుకాణ సముదాయాల వెనుక, ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద పారిశుధ్య నిర్వహణ పనులకు అధికారులు చర్యలు చేపట్టారు. గత కొద్ది రోజులుగా ఇక్కడ పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో పారిశుధ్యం క్షీణించింది. దీంతో స్థానికులు, బ్యాంకు వద్దకు వచ్చే ఖాతాదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొనేవారు. ఈ సమస్యపై గురువారం 'లంకెలపాలెం కూడలిలో క్షీణించిన పారిశుధ్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించారు. ఈ మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు సిబ్బంది ద్వారా చెత్త కుప్పలను తొలగించడంతో పాటు పూడుకుపోయిన డ్రైనేజీలను శుభ్రం చేయించారు.


ఇళ్ల నిర్మాణం కోసం స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం


ఇళ్లు నిర్మిస్తున్న గిరిజనులు

చత్రాపల్లిలో స్వచ్ఛందంగా ఇళ్ల నిర్మాణం

- నాలుగు నెలల కిందట వరదకు దెబ్బతిన్న ఇళ్లు
- అమలుకాని అధికారుల హామీలు
- ఈ స్థితిలో గృహాల నిర్మాణానికి బాధితులు సిద్ధం

సీలేరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ చత్రాపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఎత్తైన కొండ దిగువన సురక్షితమైన ప్రదేశంలో కొందరు వరద బాధితులు స్వచ్ఛందంగా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. గత ఏడాది సెప్టెంబరు 8వతేదీన ఈ ప్రాంతంలో సంభవించిన వరద బీభత్సానికిగ్రామానికి ఎదురుగా ఉన్న కొండచరియలు విరిగిపడి, చెట్లు కొట్టుకు వచ్చి గ్రామంలో ఇళ్లు, ప్రాణ నష్టం జరిగింది. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ చత్రాపల్లిని సందర్శించి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. గ్రామస్థులకు సురక్షితమైన ప్రదేశాన్ని ఎంపిక చేసి మోడల్ కాలనీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదు. ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తుందని ఎదురు చూసిన చత్రాపల్లి గిరిజనులు గిరిజనులు నిరాశతో తమకుతామే సురక్షిత ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని సొంత ఖర్చులతో ఇళ్ల నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు గ్రా మం సమీపంలో స్థలం చదును చేరుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో గూడు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని, గత్యంతరం లేక ఇళ్లను నిర్మించుకుంటున్నట్టు వారు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి


కేజీహెచ్‌లో మృతి చెందిన రోహిత్

పెదబయలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి విశాఖ కేజీహెచ్‌లో గురువారం చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కుంతుర్ల పంచాయతీ గులుగండ కు చెందిన కిల్లో సూరిబాబు కుమారుడు రోహిత్ (14) కిముడుపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొన్నాళ్ల కిందట ఈ బాలుడికి ఆరోగ్య స మస్యలు తలెత్తడంతో పాఠశాల హెచ్‌ఎం గోపలరాజు ఆధ్వర్యంలో పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనంతరం పాఠశాలకు వచ్చిన కొద్ది రో జులకు తమ కుమారుడికి మెరుగైన వైద్యం అందిస్తామని తల్లిదండ్రులు సెలవు చీటి రాసి చిన్నారిని స్వగ్రామానికి తీసుకువెళ్లినట్టు హె చ్‌ఎం తెలిపారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు రోహిత్‌ను కేజీహెచ్‌కు తరలించగా కిడ్నీ సంబంధిత వ్యాధి,పచ్చ కామెర్లు ఉన్నట్టు వైద్యులు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం విషమించి గురువారం ఉదయం రోహిత్ మృతి చెందాడు.

కాఫీ రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ


దొడ్డిపల్లిలో రైతులకు టార్పాలిన్లు అందిస్తున్న జీసీసీ బీఎం వెంకటేశ్, తదితరులు

పాడేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గిరిజన కాఫీ రైతులను ప్రోత్సాహించేందుకుగానూ ఉచితంగా వారికి టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నట్టు జీసీసీ స్థానిక బ్రాంచ్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ తెలిపారు. జీసీసీకి 100 కిలోలు పైబడి కాఫీ గింజలను విక్రయించిన రైతులకు ఈ టార్పాలిన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలో దొడ్డిపల్లిలో గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన కాఫీ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉచితంగా టార్పాలిన్‌లు అందించాలని జీసీసీ ఎండీ కల్పనాకుమారి ఆదేశించారన్నారు. అలాగే జీసీసీ కాఫీ గింజలను విక్రయించిన రైతులకు పెరిగిన ధరలకు అనుగుణంగా బోనస్‌ను అం దిస్తామని, కిలో పార్చిమెంట్‌కు రూ.115, కిలో చెర్రీ రూ.85 చొప్పున రైతులకు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. గతానికి భిన్నంగా ఈఏడాది కాఫీ రైతులకు గరిష్ఠ ధరలు అందించామన్నారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని దొడ్డిపల్లి, కరకపుట్టు, వంతాడపల్లి, గురుపల్లి, మోదాపల్లి, గుర్రగరువు, సంగోడి గ్రామాల్లోని 50మంది రైతులకు టార్పాలిన్లను అందించారు. ఈకార్యక్రమంలో జీసీసీ సిబ్బంది వంపూరు రామకృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ గెలుపునకు కృషి: గిడ్డి ఈశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న రఘువర్మను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పట్టున్న నాయకుడు రఘువర్మ అని అన్నారు. రఘువర్మను ఎమ్మెల్సీగా గెలుపునకు పార్టీ నాయకులంతా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నా రాయణ, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, నాయకులు చల్లంగి లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొర్రా విజయరాణి, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కిల్లో పూర్ణచందరరావు, కొయ్యూరు ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, కేశవరావు, లకే పార్వతమ్మ, పి.సింహాచలం, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఎంపిక


ఎంపికైన పీవో గౌరీశంకరరావు

పాడేరురూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన సర్వీసుల శాఖ, క్రీడల శాఖ, ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ భువనేశ్వర్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఎస్‌వోఏ యూనివర్సిటీ భువనేశ్వర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ పీవో పి.గౌరీశంకరరావుతోపాటు వివిధ జిల్లాలకు చెందిన 8 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఏయూ అధికారులు ఎంపిక చేసినట్టు స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన గౌరీశంరరావును ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

సజావుగా ఉత్సవం జరిపే బాధ్యత కమిటీలదే: సీఐ


ఆలయ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిడి పంచాయతీలో ఈనెల 26న జరగనున్న భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి మహోత్సవం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్త నిర్వహించాలని స్థానిక సీఐ హిమగిరి తెలిపారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులతోపాటు గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో అశ్లీల ప్రదర్శన, జూదం ఆటలు లేకుండా చూడాల్సిన బాధ్యత కమిటీలదేనని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎరుకుల నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఫార్మా రిజిస్ట్రేషన్లు తప్పనిసరి


గిరిరైతులు భూ పట్టాలు పరిశీలిస్తున్న సర్పంచి పాండురంగస్వామి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరి రైతులు విధిగా ఫార్మా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దారెల పంచాయతీ సర్పంచి పి.పాండురంగ స్వామి అన్నారు. ఆ పంచాయతీ పరిధి డింబుగూడ గ్రామంలో గురువారం ఈ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన రైతుల భూ పట్టాలను సర్పంచ్‌తో పాటు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు గుర్తింపు సం ఖ్య(ఐడీ) ఇవ్వాలనే ఉద్దేశంతో ఫార్మా రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ చేస్తున్నట్టు వివరించారు. ఈ గుర్తింపుతోనే ప్రభుత్వం నుంచి రాయితీలు, సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయకులు జి.చంద్రబాబు, ఏఈఓ గిరీశ్‌దొర, కూటమి నాయకులు కిషోర్, మాణిక్యం, నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

పెదబయలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల్లెలు పంచాయతీ సీమకొండ గ్రామ శివారులో పేకాటశిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ కొల్లి రమణ తెలిపారు. సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. నిందితులనుంచి రూ. 5,470 స్వాధీనం చేసుకున్నట్టు వివరింరు. పేకాట క్లబ్బులు,కోడి పందాలు,గంజాయి సాగు,రవాణా తదితర వాటిపై ఫోన్: 94409 04227 చేసి సమాచారం అందించాలని ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు.

విద్యా సామగ్రి పంపిణీ


పదోవ తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రి అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి

పెదబయలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే అన్నారు. గురువారం కొరవంగి పంచాయితీ కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎఫ్ బెటాలియన్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ త్రిలోచన బెహరా ఆధ్వర్యంలో చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన పూజారి సురేశ్ ఆత్మరాంజీ, బాసర సరస్వతి దేవాలయ ప్రతిధులు ప్రత్యేక పూజలు చేసి అందించిన ఈ పెన్నులు,నోటు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ జవాన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల సబ్ స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎన్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. డుంబ్రిగూడ మండలం 11 కేవీ కురిడి ఫీడర్ పరిధిలోని మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులు నేపథ్యంలో జి.మాడుగుల మండలంలోని అన్ని గ్రామాలకు, పాడేరు సబ్ స్టేషన్ 11 కేవీ బొక్కెళ్ల ఫీడర్ పరిధిలోని కోరాపుట్టు, డి.గొందూరు, కోడాపల్లి, బొక్కెళ్ల గ్రామాలకు, చింతపల్లి మండలం రాజుపాకల ఫీడర్‌లో రాజుపాకలు, పెదబరడ, గొందుపాకలు, సమగిరి, మదిగుంట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. పెదబయలు మండలం జా మిగూడ, ఇంజరి, బూసిపుట్టు, కొరవంగి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆందోళన


జంగిడివలసలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగిడివలస గ్రామంలో పాఠశాల భవన పనులు వెంటనే పూర్తి చేయాలని సర్పంచ్ సునీత డిమాండ్ చేశారు. గురువారం ఆమె సీపీఎం నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈసందరంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో నాడు-నేడులో భాగంగా రూ. 34లక్షలు ఈ పాఠశాలకు మంజూరైనట్టు చెప్పారు. ఈనిర్మాణ పనులు జామగుడ స్కూల్ కాంప్లెక్స్ తెలుగు ఉపాధ్యాయురాలు కన్యాకుమారికు అప్పజెప్పారని తెలిపారు. పాఠశాల కమిటీ బ్యాంకు ఖాతాలో డ బ్బులు ఉన్న కూడా పనులు జరగడం లేదని మండిపడ్డారు. పాఠశాల కమిటీ తీర్మానంలేకుండా ఇష్టారాజ్యంగా డబ్బులు డ్రా చేస్తున్నారన్నారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపించాలని కోరారు. పాఠశాల నిర్మాణ పనుల ప్రధానోపాధ్యాయుడికి అప్పగించాలని కోరారు. భవనంలేక విద్యార్థులకు ఆరు బయట విద్యా బోధన సాగుతుందన్నారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు సత్యనారయణ, పాఠశాల కమిటీ సభ్యులు ప్రసాద్, గాసి, సీపీఎం నాయకులు సురేష్, సత్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో దొంగలు హల్‌చల్

జి.మాడుగుల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానంగా ఓ షాపు షట్టర్ తెరిచేందుకు దుండగులు ప్రయత్నించి విఫలయ్యారు. ఈ విషయాన్ని షాపు యజమాని తన సీసీ పుటేజీ ద్వారా నమోదైన దృశ్యాలను గుర్తించా డు. స్థానిక పోలీసులు రాత్రి సమయాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ అభిషేక్‌గౌడ


మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్‌గౌడ, పక్కన డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఏపీవో వెంకటేశ్వరరావు

పాడేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని సమాజనికి ఆదర్శంగా నిలవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ సూచించారు. నాందీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విహారయాత్రకు వెళుతున్న 100 మంది గిరిజన బాలికలతో గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ధైర్యంగా మాట్లాడటం అలవరుచుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. అలాగే, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులున్నా కనీసం డిగ్రీ వరకు చదువుకుని పోటీ పరీక్షలకు సాధన చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో సి.జమాల్‌బాషా, నాందీ ఫౌండేషన్, ఇతర ప్రాజెక్టు అధికారి లోతేటి జ్యోతి, పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి మీదుగా సంగడ, జోలాపుట్టు, కుమడ, పెదబయలు తదితర ప్రాం తాల వైపు వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేశారు. ఒడిశా వైపు వెళ్లే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

మావోయిస్టు ప్రాంత యువతకు ఉపాధి: ఎస్పీ



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దర్

పాడేరురూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సరళ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు చెందిన పదో తరగతి, ఐటీఐ, వెల్డర్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 27 ఏళ్ల గరిష్ఠ వయస్సు కలిగిన గిరిజన యువతకు శిక్షణ, ఉద్యోగ కల్పనకు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్), విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) సీఎస్ఆర్ నిధులతో గురువారం ఎస్పీ కార్యాలయంలో ఇం టర్వ్యూలు నిర్వహించామన్నారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు మొదట ఇన్వెంటరీ కంట్రోల్ అండ్ వెల్డర్ కోర్సులలో రెండు నెలల పాటు శిక్షణ అందిస్తారన్నారు. అనంతరం ఉపాధి అవకాశాలను కల్పిస్తారన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు, అన్నవరం, జీకేవీధి, సీ లేరు, మంప, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, అరకువేలి మండలాలకు చెందిన 80 మంది యువతకు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ మా రిటైం అండ్ షిప్ బిల్డింగ్ సంస్థ ప్రతినిధులు కొరుబిల్లి కనకరాజు, డిప్యూటీ పర్సనల్ అధికారి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 60 మంది యువత ఎంపికైనట్టు చెప్పారు.

చింతపల్లిలో ఉపాధి ఉద్యోగులకు శిక్షణ రేపు

చింతపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో క్లస్టర్ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు శనివారం ఒక్కరోజు శిక్షణ ఏర్పాటు చేసినట్టు ఏపీడీ లాలం సీతయ్య అన్నారు. కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు హాజరుకావాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముందుగా ప్రతి పంచాయతీకి సంబంధించి సమస్యలు, అభివృద్ధి జరిగిన పనులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యులు తమకు గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు గ్రామాల్లో సమస్యలు గుర్తించాలన్నారు. తమ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని కోరారు. మారు మూల గ్రామాల రోడ్లు పూర్తి చేయాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సిబ్బంది అంగన్ వాడీ కేం ద్రాల్లో సక్రమంగా పౌష్టికాహారం పంపిణీలో ఫిర్యాదులు రాకుండా జా గ్రత్తలు తీసుకోవాలని సీడీపీవోను ఆదేశారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు గైర్హాజరుకాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ కృష్ణారావు, ఏఓ సత్యనారాయణ, ఇంజినింగ్ అధికారులు సంజీవరావు, జగదీశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్దగెడ్డ వద్ద కూరుకుపోయిన బస్సు

- గంట పాటు ట్రాఫిక్‌కి అంతరాయం


ఆర్టీసీ బస్సును ఎక్స్‌కవేటర్‌తో వెలికితీసుకున్న ఎన్‌హెచ్ సిబ్బంది

చింతపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): లంబసింగి-చింతపల్లి ప్రధాన రహదారి పెద్దగెడ్డ బ్రిడ్జి వద అప్రోచ్ రోడ్డులో ఆర్టీసీ బస్సు కూరుకుపోయింది. దీంతో గంటపాటు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్‌హెచ్ అధికారులు పె ద్దగెడ్డ వద్ద బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకల కోసం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం భారీ వర్షానికి ఈ రోడ్డు వర్షానికి బురదమయమైపోయింది. దీంతో నర్సీపట్నం నుంచి చింతపల్లి వ స్తున్న ఆర్టీసీ బస్సు ఇందులో కూరుకుపోయింది. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి ఎక్స్‌కవేటర్‌తో బస్సును వెలికితీసి రాకపోకలు పునరుద్ధరించారు.

క్షయపై అప్రమత్తం


జీకేవీధి వారపు సంతలో ర్యాలీలో వైద్య సిబ్బంది

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్ అన్నారు. గురువారం జీకేవీధి వారపు సంతలోఅవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం, దగ్గు రెండు వారాలకు మించి ఉంటే క్షయ లక్షణాలుగా గుర్తించాలన్నారు. వెంటనే సమీపంలోనున్న ఆస్ప త్రికి వచ్చి పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అచ్యుత్, ఎస్‌టీఎస్ అశోక్, ఎస్‌టీఎల్ఎస్ వెంకట రావు పాల్గొన్నారు.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్ సేవలు

- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం రైతులు పడిగాపులు


అరకు కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు మారుమూల గ్రామాల్లోని గిరి రైతులు బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ప్రభుత్వ రాయితీ తదితర పథకాలకోసం ఈకేవైసీ, ఆధార్ ఫోన్ నంబర్ అనుసంధానం అవసరం. అయితే, గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయక సచివాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. అరకుకు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోలపుట్టు సచివాలయం పరిధిలోని రైతులు ఆటోల్లో భూ రిజిస్ట్రేషన్, ఆ న్‌లైన్‌లో 1బీ, ఫోన్ నంబర్ ఆధార్ అనుసంధానంనకు వచ్చారు. సిగ్నల్ లేక ఉసూరుమంటూ వీరంతా వెనుదిరిగారు. ఈనెల25 తేది లోపల గడువు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు సిగ్నల్ అందుబాటులో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణతో బోధన మెరుగు


అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎంఈవో పుష్ప జోసెఫ్

పెదబయలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞాన జ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 గుమ్మ పుష్ప జోసెఫ్ పేర్కొన్నారు. గురువారం సీతగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 3నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను బడిపై ఆకర్షితులయ్యేలా చూడాలన్నారు. చిన్నారులకు ఆట పాటల ద్వారా విద్య అందించాలన్నారు. ఈ కార్య క్రమంలో పాఠశాల హెచ్‌ఎం సతీశ్, ఉపాధ్యాయులు సింహాద్రి, తిరుపతి, బోడ్రజు తదితరులు ఉన్నారు.

కొండల అగ్రహారంలో ఘనంగా నల్లమారెమ్మ పండుగ



అమ్మవారి దర్శనానికి ఆలయం వద్ద భక్తుల క్యూ

మాకవరపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండల అగ్రహారంలో నల్లమారెమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి ఆలయంలో విశేష పూజల ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పునుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర గ్రామాల ప్రజల తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

గొలుగొండ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 20 : మండల కేంద్రం గొలుగొండలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ 83 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైనులు, ఆర్ఐ కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో చీటీల వ్యాపారి మృతి

మాకవరపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మాకవరపాలెంలో చీటీల వ్యాపారి జి.వెంకటరామరెడ్డి (వెంకన్నబాబు) (55) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం ఏడు గంటలకు అతని భార్య టీ ఇచ్చేందుకు లేపగా, ఆయన ఎంతకీ లేవలేదు. దీంతో ఆమె పెద్దగా కేకవేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆయన చనిపోయినట్టు గుర్తించారు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఇదిలావుంటే, పెద్ద మొత్తంలో వెంకన్నబాబు చీటీలు ఎత్తారు. గత మూడు దశాబ్దాలుగా అందరితో నమ్మకంగా మెలగడంతో పెద్ద సంఖ్యలో ఈతని వద్ద చీటీలు కట్టారని సమాచారం. ప్రస్తుతం వెంకన్నబాబు మృతిచెందడంతో వారిలో ఆందోళన మొదలైంది.

26న ఉత్తర వాహినిలో గంగా హారతి

- శివరాత్రికి బలిఘట్టంలో పక్కాగా ఏర్పాట్లు
- అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం
- స్నాన ఘట్టాలు పరిశీలన

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఇక్కడి బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద ఈనెల 26న గంగా హారతి నిర్వహిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. బలిఘట్టం ఉత్తర వాహిని స్నాన ఘట్టాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరవాహిని దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిందన్నారు. ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించి బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే కాశీవిశ్వేరుడ్ని దర్శించుకున్న పుణ్యం లభిస్తుందన్నారు. శివరాత్రి సందర్భంగా ఈ నెల 26, 27, 28 తేదీలలో బలిఘట్టం ఉత్తరవాహినికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని సూచించారు. 2018లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఉత్తరవాహినిలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా స్నాన ఘట్టాలు నిర్మించామన్నారు. శివరాత్రికి గంగాహారతి చేప ట్టామని గుర్తు చేశారు. అదే విధంగా ఈ ఏడాది శివరాత్రి సందర్భంగా గంగాహారతి నిర్వహిస్తామని వివరించారు. 27న అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, పాకలపాడు గురువు ఆశ్రమం ఆధ్వర్యంలో శివరాత్రి మూడు రోజులు అన్న ప్రసాదం ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం కర్రి భాస్కర రావు రూపొందించిన బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ స్థల పురాణం తెలిపే డాక్యుమెంటరీని అయ్యన్న విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, ధనిమిరెడ్డి మధు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



శివరాత్రి ఏర్పాట్లపై సీఐతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఆటో డ్రైవర్ల సమావేశంలో ఎడిషనల్ ఎస్పీ మోహనరావు



మాదక ద్రవ్యాలపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా నేర విభాగం అదనపు ఎస్పీ మోహనరావు ఆటో డ్రైవర్లకు హెచ్చరించారు. పట్టణ స్టేషన్ ఆవరణలో గురువారం ఆటో డ్రైవర్లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. నిషేధిత ప్రాంతాలలో పార్కింగ్ చేయడం నేరమన్నారు. మాదక ద్రవ్యాలతో ఆటో ఎక్కినట్టు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలపై అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ విభాగం సీఐ అప్పలనాయుడు, పట్టణ సీఐ గోవిందరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గొలుగొండ : ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్ఐ రామారావు సూచించారు. మండల కేంద్రం గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆటోడ్రైవర్లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఆటోల్లో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించరాదన్నారు. అన్ని పత్రాలు డ్రైవర్ల వద్ద సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రయాణికుల పట్ల చక్కగా మెలగాలన్నారు. ఓవర్‌స్పీడ్ వెళ్లకుండా ఉండాలని స్పష్టం చేశారు.

ఎయిర్ పోర్టులో జగన్‌ను కలిసిన గణేశ్



జగన్‌కు శాలువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 (ఆం ధ్రజ్యోతి) : మన్యం జిల్లా పర్యటనకు వెళ్లేందుకు విశాఖ ఎయిర్ పోర్టులో దిగిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మర్యాద పూర్వంగా కలిశారు. పాలకొండలో ఇటీవల మరణించిన పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం జగన్ వెళ్లారు. ఈ సందర్భంగా విశాఖ ఎయిర్ పోర్టులో ఆయన్ని గణేశ్ కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఆయనతో పాటు సీనియర్ నాయకుడు చింతకాలయ సన్యాసిపాత్రుడు ఉన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అందుకున్న సారణి



అవార్డు అందుకుంటున్న సారణి

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధి శారదానగర్‌కు చెందిన వెలిచేటి సారణి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సంస్థ నుంచి పాటల విభా గంలో అవార్డు అందుకున్నారు. స్టార్ మేకర్ యాప్‌లో సారణి 140కి పైగా సినిమా పాటలు ఆలపించి, ఆడియో, వీడియోలతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు సంస్థ ఆమెను ఉత్తమ గాయనిగా ఎంపిక చేసింది. ఈనెల 15 తేదీన న్యూ ఢిల్లీలో ప్రశం సాపత్రంతో పాటు, బంగారు పతకం అందజేశారు.

అల్లూరి సమాధుల వద్ద శత వర్ధంతి ఏర్పాట్లు పరిశీలన

కృష్ణాదేవిపే, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి శతవర్ధంతి సందర్భంగా జాత నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి ఎస్.గోవిందరాజులు తెలిపారు. గురువారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కును పరిశీలించారు. ఈ సదర్భంగా అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధుల వద్ద నివాళులర్పించారు. పార్కులో శత వర్ధంతి జాతకు సంబంధించిన సభా వేదిక, విచ్చేసిన వారికి కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి అల్లూరి సమాధులున్న కృష్ణాదేవిపేట వరకు ఈనెల 22, 23 తేదీల్లో అల్లూరి శతవర్ధంతి జాత నిర్వహించనున్నామన్నారు. విప్లవ వీరుడు అల్లూరిని బ్రిటీష్ పోలీసులు పట్టి బంధి, కాల్చి చంపారన్నారు. ఆయన చనిపోయి ఇప్పటికి వంద సంవత్సరాలు అయ్యిందన్నారు. అల్లూరి వంటి పోరాట యోధుడు త్యాగాల వలన మనదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినట్టు చెప్పారు. అల్లూరి జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజెప్పేందుకే అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 2024 మే ఏడో తేదీ నుంచి 2025 మే ఏడో వరకు సంవత్సరం పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 23వ తేదీన ఇక్కడ జాత జరుపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు బసవరాజు, అల్లూరి యువజన సంఘం రాష్ట్ర నాయకులు శ్యామల వరలక్ష్మి, భాస్కరమణి , అంబటి వరహాలరాజు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి సమాధి వద్ద జాత నిర్వాహకులు నివాళి

ఘనంగా షిర్డీసాయి తీర్థ మహోత్సవం



జాతరలో ఎడ్ల పరుగుపోటీ

రావికమతం, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి): మండలంలో తట్టబంద గ్రామంలో గురువారం షిర్డీసాయి తీర్థమహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బాబాకు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణ సంచా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నానం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 10 జతలు ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. విజేతలకు ఉత్సవ కమిటీ నగదు బహుమతులు అందజేసింది.

రఘువర్మకు వ్యాయాయ ఉపాధ్యాయ సంఘం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ

చోడవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన రఘువర్మకు ఉత్తరాంధ్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం మద్దతు ప్రకటించింది. మండలంలోని వెంకన్నపాలెంలో గురువారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులంతా ఏకగ్రీవంగా రఘువర్మకు మద్దతుపై నిర్ణయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల పీడీ, పీఈటీ అసోసియేషన్ నాయకులు భూపతి, సూరిబాబు, ఎం. రాంకుమార్, గణేశ్, ఈశ్వరబాబు, రాజుర, చిన్నారి, కృష్ణంరాజులతో పాటు, స్థానిక ఏపీటీఎఫ్ నాయకులు టి. త్రినాధ్, బి. వెంకటపతిరాజు, ధర్మారావు, ఎం ఎం. ఎల్ నాయుడు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి ప్రధానమంత్రి సహాయనిధి

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేటలో కేన్సర్‌తో బాధపడుతున్న సయ్యపురెడ్డి సావిత్రికి ఎంపీ సీఎం.రమేశ్ ప్రధానమంత్రికి సహాయనిధి నుంచి రూ. లక్షలు మం జూరు చేయించారు. సావిత్రి చికిత్స అందిస్తున్న విశాఖపట్నంలోని ఆస్పత్రికి ఆన్‌లైన్ ద్వారా ఈ సొమ్ము జమ చేసినట్టు ప్రధానమంత్రి కార్యాలయం అధికారులు లేఖ ద్వారా తెలిపినట్టు ఎంపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో సావిత్రి కుటుంబ సభ్యులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.

'పాలనలో కూటమి ప్రభుత్వ విఫలం'

చోడవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అలవికాని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలతో పాటు, యువతను కూడా దగా చేసేలా పాలన కొనసాగిస్తున్నదని వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేశ్ విమర్శించారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ని ర్వహించిన రాష్ట్ర యువజన విభాగం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్ర భుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై త్వరలో జిల్లావ్యాప్తంగా ఆం దోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యత్నాలతో పాటు, రైతులకు జరుగుతున్న అన్యాయం, సూపర్‌సిక్స్ పథకాల హామీల వైఫల్యంను ప్రజలకు వివరిస్తామన్నారు.

నెరవేరనున్న నేరేడుబంద రహదారి కల

- అనుకూలంగా మూడు శాఖల అధికారుల సర్వే నివేదిక
- కలెక్టర్ అనుమతితో త్వరలో రోడ్డు పనులు
- చోడవరం రేంజ్ అధికారి రవివర్మ

రావికమతం, ఫిబ్రవరి, 20, (ఆంధ్రజ్యోతి): కొండ శిఖరంపై ఉన్న నేరేడుబంద గిరిజన గ్రామ రహదారి నిర్మాణానికి త్వరలో మోక్షం లభించనుంది. కలెక్టర్ ఆదేశాలపై ఎట్టకేలకు మూడు శాఖల అధికారుల జాయింట్ సర్వే పూర్తి చేసిన నివేదికను డీఎఫ్‌ఓకి పంపారు. చోడవరం రేంజ్ అటవీఅధికారి పీవీ రవి వర్మ అందించిన వివరాలివి.. మండలానికి శివారునున్న చీమలపాడు పంచాయతీ శివారు జెడ్. జోగుంపేటను ఆనుకొని కొండపై నేరేడుబంద ఉంది. 15 కుటుంబాలకు చెందిన వంద మంది గిరిజన జనాభా నివసిస్తోంది. జెడ్. జోగుంపేటకు రెండున్నర కిలోమీటర్ల కొండపై ఉన్న ఈ గ్రామానికి రహదారి సౌకర్యంలేక అక్కడి పిల్లలు రోజూ గుర్రాలపై దిగువ జెడ్. జోగుంపేట పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. ఎవరికి అనారోగ్యం చేసినా డోలీ మోతలు తప్పడంలేదు. ఈ దుస్థితిపై ఎన్నో సార్లు సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళనలు చేపట్టారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గ్రామానికి రెండున్న కిలో మీటర్ల మేర పక్కా రోడ్డు నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరు చేసింది. అయితే ,అటవీ శాఖ అనుమతుల సమస్యతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో గ్రామ గిరిజనులు ఆందోళనకు దిగారు. స్పందించి కలెక్టరు విజయ్‌కృష్ణన్ ఆదేశాలపై పీఆర్, రెవెన్యూ, అటవీశాఖ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించారు. దీనిలో అటవీశాఖ భూమి ఒక హెక్టార్, మిగిలింది రెవెన్యూ భూమిగా గుర్తించారు. అటవీ శాఖ భూమిలో గతంలోనే నాలుగు మీటర్ల వెడల్పున రోడ్డు ఉందని, కొత్తగా నిర్మాణంతో అటవీ శాఖకు నష్టం రాదని గుర్తించి ఈ నివేదికనుజిల్లా అటవీశాఖ అధికారికి నివేదికి (ఎన్ఓసీ) పంపించినట్టు చోడవరం రేంజ్ అధికారి పీవీ రవి వర్మ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా తెలిపారు. తదుపరి అనుమతుల కోసం డీఎఫ్‌వో కలెక్టరకు వీటిని పంపిస్తారన్నారు. కలెక్టర్ ఆదేశించిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపడతారు.



మాట్లాడుతున్న రవివర్మ

వినియోగంలోకి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు



వడ్డాదిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష రాణి తనిఖీ చేశారు. ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మితో కలిసి గురువారం ఈ కేంద్రాన్ని సందర్శించారు. సంఎద తయారీ కేంద్రం వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం వద్ద పం చాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూరగాయలు, బొ ప్పాయి పండ్ల సాగును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సంపద తయారీ కేంద్రాలను కచ్చితంగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పంచాయతీ ఈవో ఎంవీఎస్ లోవరాజు, సంపద తయారీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలి వినతి



ఎస్పీని సన్మానిస్తున్న దళిత నాయకులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హాను జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ రేబాక మధు బాబు కోరారు. బుధవారం కె.కోటపాడు, ఏ.కోడూరు పోలీస్ స్టేషన్లు తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్పీని మధుబాబుతోపాటు కె. కోటపాడు సర్పంచ్ ఎర్రంశెట్టి భవానిగురయ్య, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ఇన్‌చార్జి మల్లవరపు లోవచంద్ కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీతో మాట్లాడుతూ నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ కేసులు, చట్టాల పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, కులాంతర వివాహలను ప్రోత్సహించేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన వెంటనే సంబంధిత డీఎస్పీ విచారణ వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఎస్పీని వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు సీఐ పైడంనాయుడు, ఎస్ఐ రాజన ధనుంజయ్, నాయకులు అప్పారావు, జై భీమ్ సేన సేవా సంఘం లీగల్ అడ్వయిజర్ అడ్వకేట్ మహేశ్వరరావు, సత్యనారాయణ, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి 'గవిరెడ్డి' సాయం

చీడికాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో ముందుంటానని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మం డలంలో తునివలస శివారు వింటిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న అభయాం జనేయస్వామి ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నా యకుడు నానాజీ, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన కీర్తిప్రియ

రోలుగుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎన్.కీర్తి ప్రియ ఎన్ఎన్ఎంఎస్ ఉపకారవేతనానికి ఎంపికైనట్లు హెచ్ఎం శేఖర్ తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ రాత పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు. ఈనేపథ్యంలో ఏడాదికి రూ.12వేల చొప్పున ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు రూ.48వేలు నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కీర్తి ప్రియను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు..

చోరీల నిరోధానికి చర్యలు తీసుకోవాలి

మాడుగుల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రారంభం కావడంతో ఆరుబయట, మే డలపై నిద్రించే సమయంలో కొంతమంది గు ర్తుతెలియని వ్యక్తులు ఇళ్లలోకి చొరబడి చిల్లర దొంగతనాలు చేసే పరిస్థితి ఉంటుందని, ఈనేపథ్యంలో నిఘా పెంచాలని పోలీసులను గ్రామానికి అప్పలరాజు, వరహాలు, సురేశ్, కొండబాబు, రాము, లక్ష్మణ్ తదితరులు కోరారు. ఏటా వేసవిలో ఇళ్లముందు పార్కింగ్ చేసే వాహనాల్లో పె ట్రోల్ దొంగతనంతోపాటు బ్యాటరీలు పట్టుకుపోతున్న సంఘటనలున్నాయన్నారు.ఇలాంటివి జరగకుండా పోలీస్ అధికారులు రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటుచేయాలని కోరారు.

బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో బైక్ దగ్ధం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వడ్డాదిలో కుబిరెడ్డి ఈశ్వరరావు పార్కుచేసిన ద్విచక్రవాహనం గురువారం దగ్ధమైంది. రాత్రి ఇంటి ఆవరణలో పార్కుచేసిన వాహనం ఉదయం పొలానికి వెళ్లాలని ఈశ్వరరావు స్టార్ట్ చేశారు. ఇంతలో బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్‌కు పెద్ద శబ్దం వచ్చి అనంతరం వాహనంతో దగ్ధమైంది. ఈశ్వరరావు చేతి వేళ్లు, పొట్ట కాలిపోయింది. అతన్ని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఫిర్యాదుమేరకు పోలీస్ కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, అనకాపల్లి క్లూస్‌టీమ్, బాంబు స్క్వాడ్‌తో దర్యాప్తు ప్రారంభించింది. వాహనంలో బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతి అయినట్టు పోలీసులు నిర్ధారించారు.

తగ్గిన చింతపండు ధరతో రైతు దిగాలు

చీడికాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనాంలో జరిగే వారపు సంతలో కొత్త చింతపండుకి ఈ వారం కాస్తా ధర తగ్గడంతో గిరిజన రైతులు దిగాలు చెందారు. కోనాం ఎగువన ఏజెన్సీ గ్రామాల నుంచి వేకువజామున కా విళ్లు, నెత్తిన మోసుకుంటూ చింతపండు తీసుకువచ్చారు. ఇం తగా శ్రమించి తీసుకువచ్చిన చింతపండుకు ఈ వారం గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఆ వేదన వ్యక్తంచేశారు. గ తవారం కిలో రూ.60లు ధర పలకగా ఈసారి రూ.40లు నుంచి రూ.45కు మా త్రమే కొనుగోలు చేశారు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు ఎక్కువ మందిరాకపోవడంతో ధర రాలేదని సమాచారం. వచ్చిన ఆదాయంతో నిత్యావసరాలు కొనుగోలు చేసి స్వ గ్రామాలకు వెళ్లిపోయారు.

ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.కోడూరు శివాలయానికి భక్తులు గురువారం రూ. లక్ష విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన చింతా నారాయణమూర్తి, నారాయణమ్మ కుమారులు వెంకట నరసయ్య, వెంకట లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, సోమకేశవరావు కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి పనులకు ఈ సొమ్ము అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నరసింహమూర్తి, కమిటీ చైర్మన్ చింతా వెంకట నారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి పడాల అప్పలనరసయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపునకు స్పందన



ఆధార్ క్యాంపులో పాల్గొన్న ప్రజలు

చీడికాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం సచివాలయంలో జరిగిన ప్రత్యేక ఆధార్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఈ కేంద్రంలో చీడికాడ, అర్జునగిరి డిజిటల్ అసిస్టెంట్‌లు దొడ్డి జగదీష్, సింగంపల్లి వాసును ఎంపీడీవో హేమసుందరరావు నియమించారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ శిబిరానికి కోనాం పంచాయతీ ఏజెన్సీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు 65మంది నమోదు చేసుకున్నట్టు డిజిటల్ అసిస్టెంట్లు తెలిపారు. ఈ ఆధార్ నమోదు శుక్రవారం కూడా కొనుసాగుతుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలోని ఎం.అలమండ ఫీడర్‌లో గ్రామాలకు శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగ నుందని ఏఈఈ కర్రి. శంకరరావు తెలిపారు. ములకలాపల్లి, కొత్తపెంట, ఎం.అల మండ, ఎన్.గజపతినగరం, ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

గంజాయి రవాణాను సమూలంగా అరికట్టండి

» నేర విభాగం అదనపు ఎస్పీతో

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన క్రైమ్ విభాగం అడిషనల్ ఎస్పీ మోహనరావు

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాని పూర్తిగా అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో జిల్లా నేర విభాగం అదనపు ఎస్పీ కె.మోహనరావు స్పీకర్ అయ్యన్నపాత్రుడుని మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నేరాల అదుపు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పీకర్ సూచించారు. డ్రంగ్ అండ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారితో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నేర విభాగం సీఐ అప్పలనాయుడు, పట్టణ సీఐ గోవిందరావు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి మాలధారణ ప్రారంభం



మాల వేసుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర దగ్గర పడుతుండడంతో భక్తులు అమ్మవారి మాలలను గురువారం ధరించారు. జాతర అయ్యే వరకు భక్తులు నియమ నిష్టలతో దీక్ష చేపడతారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అంబలం పూజలు నిర్వహించనున్నట్టు అమ్మవారి మాలధారణ సంఘ వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను తెలిపారు. వచ్చే నెల 25వ తేదీన అన్నసమారాధన నిర్వహించి అనంతరం ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీను, కోలపర్తి శ్రీను, మళ్ల గణేష్, బుద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు టీడీపీ పరిశీలకులుగా దుర్గారావు, ఆనందబాబు



మామిడి దుర్గారావు



గొల్లంగి ఆనందబాబు

మధురవాడ/ కొమ్మాది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మాడుగుల నియోజకవర్గం టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, మధురవాడకు చెందిన మామిడి దుర్గారావు, నర్సీపట్నం నియోజకవర్గానికి గొల్లంగి ఆనందబాబు నియమితులయ్యారు. తమకు అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా నిర్వహించి కూటమి అభ్యర్థి రఘువర్మ గెలుపునకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

23న న్యాయవాదుల సదస్సు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ ఎట్ డోర్ స్టెప్స్ నినాదంతో విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 23న జిల్లా కోర్టుల ఆవరణలోని బార్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో న్యాయవాదుల సదస్సు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల న్యాయవాదులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

వీడిన మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

ఆనవాళ్లు కనిపించాయి. అక్కడ లభించిన వస్తువులనుబట్టి అది తన తండ్రిదేనని దుర్గాప్రసాద్ గుర్తించాడు. ఈ కేసులో భీమిలి మండలం నేరేళ్లవలసకు చెందిన ఊళ్ల చిన్నారావు దంపతులను నిందితులుగా గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు.

ఏం జరిగిందంటే...

నేరేళ్లవలస ప్రాంతానికి చెందిన చిన్నారావు దంపతులు నెల క్రితం ఆనందపురం మండలం ఎల్.వి.పాలెంలో అద్దెకు దిగారు. వారికి ఇంటి సమీపంలో ఉండే టీ దుకాణం యజమాని యెడ్ల తిరుపతమ్మతో పరిచయం ఏర్పడింది. ఆ టీ దుకాణం వద్దకు ప్రతి మంగళ, ఆదివారాల్లో అప్పన్న దొర వెళుతుండేవాడు. అతను సమస్యల నుంచి ఉపశమనం కోసం పూజలు చేస్తుంటాడని చిన్నారావు భార్య తెలుసుకుంది. తనకు సమస్యలు ఉన్నట్టు చెప్పడంతో పూజలు చేస్తానని ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడమేగాక, బలవంతంగా లోబరుచుకున్నాడు. ఆ విషయం ఎవరితోనైనా చెబితే కుటుంబాన్ని నాశనం చేస్తానని బెదిరించాడు. ఆమె ఈ విషయాన్ని తన భర్త చిన్నారావుకు తెలియజేసింది. ఈ నేపథ్యంలో అప్పన్నను హత్య చేసేందుకు ఇరువురూ పథకాన్ని రచించారు. అందుకోసం ఒక బటన్ నైఫ్‌ను సిద్ధం చేసుకున్నారు. అనంతరం తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని పూజ చేయాలని, అందుకు సంభావనగా రూ.7 వేలు ఇస్తానని అప్పన్నకు చిన్నారావు ఫోన్ చేశాడు. ఈ నెల 9న అప్పన్న ఆనందపురం రాగా...తన తల్లి ఉప్పాడలో ఉంటుందని, అక్కడకు తీసుకువెళతానంటూ పల్సర్ బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. బోయపాలెం మీదుగా కాపులుప్పాడ నుంచి చేపలుప్పాడ వెళ్లే గ్రావెల్ రహదారిలోకి తీసుకువెళ్లాడు. మార్గమధ్యంలో గంభీరం గెడ్డ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ లేఅవుట్‌లో గల షెడ్డు వద్దకు తీసుకువెళ్లి అప్పన్నను చిన్నారావు కత్తితో పొడిచి హతమార్చాడు. ఈ సందర్భంలో ఇరువురి మధ్య జరిగిన పెనుగులాటలో చిన్నారావు చూపుడు వేలికి గాయమైంది. కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందాడు. తిరిగి 11వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటలకు పెట్రోల్ తీసుకుని భార్యతో కలిసి ఆరు గంటలకు ఆ లేఅవుట్ వద్దకు వెళ్లాడు. అప్పన్న శవంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అప్పన్నను హతమార్చిన చిన్నారావును, నేరం చేయడానికి సహకరించి సాక్ష్యాలను తారుమారు చేయడానికి యత్నించినందుకు అతడి భార్యను గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి నైఫ్, రక్తపు మరకలు కలిగిన జీన్స్ ప్యాంటు, అప్పన్న ఫోన్ పౌచ్, లైటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సుధాకర్ తెలిపారు.

పక్కాగా వాహనాల ఫిట్‌నెస్

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించి ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారు.

గతంలో మాదిరిగా ఫిట్‌నెస్ కోసం వాహనదారులు ఆర్టీవో కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి వుండాల్సిన అవసరం లేదు. ఏటీఎఫ్‌టీఎస్ పూర్తిగా కంప్యూటర్ ఆధారంగా పనిచేస్తుంది. మోటారు వాహన చట్టం 1988 ప్రకారం వాహనాల్లో లోపాలను ఈ యంత్రం ద్వారా గుర్తిస్తారు. వాహనంలో చిన్నపాటి లోపం ఉన్నా ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం జారీ కాదు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశాలున్నాయి. ఏ వాహనం, ఏ రోజున ఫిట్‌నెస్‌కు వస్తుందనేది రవాణా శాఖ కార్యాలయం నుంచి ఏటీఎఫ్‌టీఎస్ నిర్వాహకులకు జాబితా వెళుతుంది. దీని ప్రకారం ఆయా వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు జరిపి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. నూతన విధానంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీపై జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి సంప్రదించగా.. సబ్బవరం మండలం నారపాడు వద్ద ఒక ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏటీఎఫ్‌టీఎస్ ప్రారంభమైందని చెప్పారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని, త్వరలో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ కేంద్రం పర్యవేక్షణపై తమ శాఖకు ఇంకా ఎటువంటి మార్గదర్శకాలు జారీ కాలేదని తెలిపారు.

బడి భోజనం మరింత రుచిగా!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 6,776 మంది చదువుతున్నారు. జిల్లా విద్యా శాఖ గణాంకాల ప్రకారం పాఠశాలల్లో 81 వేల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. తింటున్నారు. మధ్యాహ్న భోజనం అమలుకు ప్రభుత్వం ఇటీవల వరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రోజుకు రూ.5.88 చొప్పున ఖర్చు చేస్తున్నది. పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల భోజనం ఖర్చును రూ.6.19కి పెంచింది. ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు రూ.8.17 నుంచి రూ.9.26కి పెంచింది. కొత్త మెనూ అమలుకు విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఎన్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

... 5వ పేజీ తరువాయి

పునఃప్రారంభం అయ్యాయి. అప్పటికే ఇరువైపులా కిలోమీటరుకుపైగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సాధారణ పరిస్థితికి రావడానికి మరో అర్ధ గంట సమయం పట్టింది. ప్రస్తుతం గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ జరుగుతుండడంతో చెరకు రవాణా చేసే ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, లారీల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ అధికంగా వుంది. ఇటువంటి సమయంలో వాహనాలు ఏమైనా పాడైపోయి రోడ్డుపై ఆగినా, వాహన ప్రమాదాలు జరిగినా.. కొద్ది సేపట్లోనే ట్రాఫిక్ స్తంభిస్తున్నది. షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ జరిగే కాలంలో ఫ్యాక్టరీ యాజమాన్యంతోపాటు, పోలీసులు కూడా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టేవారు. కానీ ఈ ఏడాది ఎవరూ పట్టించుకోకపోవడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నది.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చింతపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం వీరవరం గ్రామం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు గిరిజన యువకులకు గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గైగుంపల్లి గ్రామానికి చెందిన సీహెచ్. శివరామ్, లోవ ప్రసాద్ బైక్‌పై జర్రెల వెళుతున్నారు. జర్రెల గ్రామానికి చెందిన లక్ష్మయ్య ద్విచక్రవాహనంపై చింతపల్లి వస్తున్నాడు ఈ. రెండు వాహనాలు వీరవరం వద్ద బలంగా ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన శివరామ్, లక్ష్మయ్యలను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సరుగుడు, జీడిమామిడి తోటలు దగ్ధం



కొంతలంలో దగ్ధమైన సరుగుతోట

రోలుగుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతలం శివారున గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. శరభవరం గ్రామానికి చెందిన మచ్చా రాజు తన చెరకు తోట పంట తీసేసిన తర్వాత శుభ్రం చేయడానికి నిప్పు పెట్టాడు. దీంతో చెరకు తోటలో నుంచి మంటలు చెలరేగి పక్కనే ఉన్న రైతు అలమండ వరహాలు సరుగుడు తోటకు వ్యాపించాయి. మూడు ఎకరాల్లో తోట దగ్ధమైంది. అలాగే పక్కనే ఉన్న కేశరపూడి చంటమ్మ, దుర్గాబ్బాయి, చోడి గణేశ్‌కు చెందిన జీడిమామిడి తోటలకు నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్టు అంచనా. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

వరహాపురంలో చెరకు తోట దగ్ధం

చీడికాడ: మండలంలోని వరహాపురంలో గురువారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఎకరాల్లో చెరకు తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బాలిబోయిన రాజుబాబు, మిస్కా పైడిబాబు చెందిన రూ. 1.5 లక్షల పంట నష్టపోయినట్టు అంచనా. సమాచారం మేరకు చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అ దుపు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మిస్కా రామరాజుయాదవ్ మాట్లాడుతూ, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

భవిష్యనిధి కార్యాలయంలో 27న 'నిధి ఆప్ కే నికత్'

మురళీనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి); భవిష్యనిధి (పి.ఎఫ్) ఖాతాదారులకు, ఉద్యోగ యాజమాన్య సంస్థలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న విశాఖ సిటీలోని మర్రిపాలెం పి.ఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో 'మీ వద్దకే పి.ఎఫ్' (నిధి ఆప్ కే నికత్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పి.ఎఫ్.కమిషనర్ సి.ఎస్.పవన్‌కుమార్ జాస్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులకు సంబంధించిన పి.ఎఫ్, పెన్షన్, నగదు బదిలీ (క్లెయిమ్ ట్రాన్స్‌ఫర్) లాంటి సేవలకు సంబంధించి వివరణాత్మక సలహాలు ఇస్తూ, ఇబ్బందులు ఉంటే పరిష్కారానికి అధికారులు తోడ్పాటు అందిస్తారని కమిషనర్ తెలిపారు. 27న పి.ఎఫ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సేవలు అందిస్తారన్నారు. మర్రిపాలెం ఈఎస్‌ఐ కార్యాలయం, అనకాపల్లి ఈఎస్‌ఐ కార్యాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐటీడీఏ సమావేశ మందిరాల్లోనూ హాజరుకావచ్చని అన్నారు. వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, సంస్థలను నడిపే యజమానులు వారి పి.ఎఫ్ ఖాతాల నిర్వహణలో సమస్యల్ని 'నిధి ఆప్ కే నికత్' అని కవర్‌పై రాసి కార్యాలయాల్లో ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమస్యల్ని పోస్టు ద్వారా లేదా ఫోన్ 0891 2558734 నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చేతులు మారుతున్న 'తహశీల్దార్' భూములు!

... 5వ పేజీ తరువాయి

చాలా భూములు ఉన్నాయనే విషయం అక్కడి తహశీల్దార్‌కు వీఆర్‌ఓ చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. ఇక్కడ అది కూడా జరగలేదు. ఒకే రోజు...ఒక వ్యక్తి పేరు మీద ఉన్న భూములు 43 పద్దుల ద్వారా మ్యుటేషన్ చేయడం అంటే...తప్పకుండా లోతుగా విచారణ చేపట్టాల్సి ఉంటుంది. కానీ అది కూడా చేయలేదు. కనిపించిన భూమినంతా నోషనల్ ఖాతా పేరుతో నమోదు చేసేసి, ఆ తరువాత తాపీగా ఎవరు క్లెయిమ్ చేసుకుంటే వారి పేర్ల మీద మ్యుటేషన్ చేస్తున్నారా?...అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ అదే జరిగితే ఇది భారీ కుంభకోణమే అవుతుంది. మండలాధికారులు అంతా కలిసి చేస్తున్నట్టుగానే భావించాల్సి ఉంటుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	437
విజయనగరం	441
శ్రీకాకుళం	441